సాక్షి ప్రకాశం

బుధవారం । 10 । జూలై । 2024



డెత్ హైవే

జంగంగుంట్ల–కంభం హైవే ప్రమాదాలు నిత్యకృత్యంగా ఉన్నాయి. పది రోజుల్లో ముగ్గురు మృతిచెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

- 10లో..



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

మార్కాపురం పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఐదు దుకాణాల్లో అమ్మకాలు నిలిపేశారు.

- 10లో..

గరిష్టం/కనిష్టం
31/21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

30 మండలాల్లో చిరుజల్లులు

- పొన్నలూరు మండలంలో అత్యధికంగా 54.4 మి.మీ

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో పలు మండలాల్లో అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. జిల్లాలోని 38 మండలాలకు గాను 30 మండలాల్లో సోమవారం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అందులో అత్యధికంగా పొన్నలూరు మండలంలో 54.4 మి.మీలు నమోదు కాగా అత్యల్పంగా పామూరు, కురిచేడు మండలాల్లో 1 మి.మీలు నమోదైంది. అదే విధంగా మద్దిపాడులో 39.4 మి.మీ, జరుగుమల్లి 37.2, ఒంగోలు రూరల్, అర్బన్ 34.2, రాచర్ల 33.2, ఎస్ కొండ 27.4, ఎన్‌జీపాడు 26.2, కొమరోలు 17.8, గిద్దలూరు 12.4, ఎస్ఎన్‌పాడు 10.8, కొత్తపట్నం 9.8, కొండపి 9.2, బేస్తవారిపేట 8.2, దర్శి 7.8, ముండ్లమూరు 7, దొనకొండ 6.4, టంగుటూరు, కంభంలలో 5.4 మి.మీ చొప్పున, పీసీపల్లి 3.2, కొనకనమిట్ల, అర్ధవీడులలో 2.8 మి.మీ చొప్పున, చీమకుర్తి, మార్కాపురంలో 2.4 మి.మీ చొప్పున, కనిగిరి, మర్రిపూడిలలో 2 మి.మీ, సీఎస్‌పురం 1.4, తర్లుపాడు 1.2 మి.మీ నమోదైంది.

ఎస్ఎస్ఏలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం


ఒంగోలు: స్థానిక సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న సీఎంఓ, ఐఈ కోఆర్డినేటర్, ఏఎల్ఎస్ సీవో, ఏఎస్ఓ పోస్టులకు ఫారిన్ సర్వీస్‌పై పనిచేసేందుకు ఆసక్తిగల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఎస్ఏ పీవో డి.సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో పనిచేసేందుకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు ఇందుకు అర్హులన్నారు. ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా సంబంధిత అధికారుల ద్వారా ధ్రువీకరించిన దరఖాస్తులను సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, సర్వీస్ రిజిస్టర్‌తో జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేయదలచిన వారు విడివిడిగా దరఖాస్తులు సమర్పించాలని, దరఖాస్తు నమూనాను, మార్గదర్శకాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీఈవోప్రకాశం.కో.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

రైతు ఉపకారి

వేప.. మానవాళికి ప్రకృతి ప్రసాదించిన దివ్య ఔషధం. అజాడిరక్టా ఇండికా అని శాస్త్రీయంగా పిలుచుకునే ఈ చెట్టులో ప్రతి భాగం ఔషధమయమే. ఇది వ్యవసాయంలోనూ రైతులకు ఎంతో మేలు చేస్తోంది. వేప గింజల నుంచి తీసే నూనె, పిండి.. రైతు నేస్తాలుగా నిలుస్తున్నాయి. పంటల సాగులో వీటి వినియోగంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. పైరుకు చీడపీడలు సోకవు. రసాయన మందుల వాడకం తగ్గుతుంది. సాగు ఖర్చులు కలిసొస్తాయి. మేలు రకమైన ఉత్పత్తులు పొందవచ్చు. అన్నదాతలకు పూర్తి స్థాయిలో అవగాహన పెరగడంతో రసాయనాల స్థానంలో వీటిని విరివిగా వాడుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో వీటి పాత్ర కీలకంగా ఉంది.



పాకలలో వేప ఆకు వలుస్తున్న ప్రకృతి వ్యవసాయదారులు



కాయలు కాసిన వేప చెట్టు

- ప్రకృతి వ్యవసాయంలో వేప ఉత్పత్తుల కీలక పాత్ర
- రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకానికి చెక్
- వేపనూనె, పిండి వినియోగంతో తెగుళ్ల నివారణ
- 300 రకాల కీటకాల నాశనం

ఒంగోలు సెంట్రల్: రైతులకు వేప ఉత్పత్తులు సాగులో సాయం చేస్తున్నాయి. వేప చెట్టులో వేరు మొదలు బెరడు, ఆకులు, పువ్వులు, పండ్లు, విత్తనాలు ఇలా సమస్త ఔషధ గుణాలతో నిండి ఉంటాయి. వీటిని వినియోగించటం వల్ల పంటకు బలం చేకూరటమే కాకుండా.. భూమికి కూడా సత్తువ కలుగుతుంది. రసాయన ఎరువులు వినియోగించడం వల్ల ఫలసాయంతో పాటు భూసారం కూడా తగ్గుతుంది. జిల్లాలో గత సంవత్సరం 49,250 మంది రైతులు ఖరీఫ్, రబీలో కలిపి లక్ష్యానికి మించి 98 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేశారు. ఈ ఏడాది 55,584 మంది రైతులతో 78,014 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 19,378 మంది రైతులు 23,067.88 ఎకరాలు సాగు చేశారు. ఈ ఏడాదీ ప్రకృతి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.



చీమకుర్తి మండలంలో వేప పిండిని వరిలో చల్లేందుకు తీస్తున్న రైతు రాధ

వేపతో 300 రకాల కీటకాలు నాశనం

వేపలో అజాడిరాక్టిన్ అనే పదార్థం ఉంటుంది. దీనికి 300 రకాల కీటకాలు, నల్లి జాతి పురుగులు, చెదలు, భూమిలోని నెమటోడ్స్, కొన్ని రకాల బూజు శిలీంద్రాలను అరికట్టే శక్తి ఉంటుంది. వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్‌లో వేప పిండి, వేప నూనె, వేప కషాయం ఇలా వివిధ రకాల వేప ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. నీమ్ ఆయిల్‌ను స్థానిక వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు వినియోగిస్తే కీటకాలను నివారించవచ్చు. ఈ మందు స్ప్రే చేసినప్పుడు పురుగులకు వికారం కలిగించి పైరును నాశనం చేయకుండా కాపాడుతుంది. అంతేకాదు పక్షులు, మానవులు, మిత్రపురుగులు, తేనెటీగలు వంటి జీవరాశులకు హాని చేయదు. సమగ్ర సస్యరక్షణలో వేప సంబంధిత మందులు బాగా ఉపయుక్తమవుతాయి. పురుగు మందులు, శిలీంద్ర నాశినులతో వేపను కలిపి సురక్షితంగా పిచికారీ చేయవచ్చు.



వేప రసం



వేప కాయలు

తెగుళ్ల బెడదకు చెక్

పంటల సాగులో ఎక్కువగా వేప నూనె వాడారు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేప పిండిని దమ్ములో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి 3 మిల్లీలీటర్ల చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్ల పిచికార్లు పిచికారీ చేస్తే అగ్గి తెగులు, తొడిమ కుళ్లు, పొడ తెగులు, వరి తుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. 5 శాతం వేప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిర్చి పైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. మిర్చికి సోకే జెమినీ వైరస్ కూడా అదుపులో ఉంటుంది. వేరుశనగ పైరును ఆశించి ఎక్కువగా నష్టపరిచే తిక్కా ఆకుపచ్చ తెగులు, టమోటా సాగులో ఎండు తెగులును వేప నూనెతో నివారించవచ్చు.

ఇంట్లోనే కషాయం తయారీ..

పంటకు అవసరమైన వేప కషాయాన్ని ఇంటిలోని మహిళలు తయారు చేసుకోవచ్చు. ఐదు కిలోల వేప గింజలు నలగ్గొట్టి, ఆరు నుంచి ఏడు లీటర్ల నీటిలో ఒకటి నుంచి రెండు రోజులు నాన బెట్టాలి. దీన్ని వస్త్రంతో పోసి వడకట్టాలి. మరో 100 లీటర్ల నీటిని అందులో కలిపి వినియోగించాలి.

గాఢతనుబట్టి వినియోగించాలి

పైరుపై పురుగు ఆశించిన వెంటనే వేప మందు పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. ఎకరాకు మూడు నుంచి ఐదు మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి వాతావరణం చల్లగా ఉన్న సమయంలో(ఉదయం లేదా సాయంత్రం) పిచికారీ చేయాలి. 7 నుంచి 15 రోజుల వ్యవధిలో ఈ పని పూర్తి చేయాలి. పిచికారీ చేసిన తర్వాత 6 గంటల వ్యవధిలో వర్షం పడితే మళ్లీ పిచికారీ చేయాల్సిందే. మార్కెట్‌లో వేప నూనె మందులు వివిధ గాఢతలో లభిస్తాయి. అవి 300, 1500, 3 వేలు, 10 వేలు పీపీఎంలలో నాలుగు రకాలుగా లభిస్తాయి. గాఢతలను అనుసరించి తగిన మోతాదులో పంటలపై పిచికారీ చేసుకోవాలి. దీనిని పదే పదే వినియోగిస్తే మొక్కల్లో ఎదుగుదల మందగిస్తుంది.

సబ్సిడీపై వేప ఉత్పత్తులు అందించాలి



ఉద్యాన వన పంటల్లోనే కాకుండా వరిసాగులో వేప పిండి, నూనె తదితర ఉత్పత్తులు అధికారుల సూచనలతో వాడితే మంచి ఫలితాలు వస్తాయి. నేను ప్రకృతి వ్యవసాయంలో వాడాను. మంచి ఫలితాలు వచ్చాయి. అయితే కొంచెం ధర ఎక్కువగా ఉంటుంది. స్వతహాగా వేప కాయలు సేకరించి తయారు చేయటం మరింత మేలు. వ్యవసాయ, ఉద్యాన వన, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి వాడితే మంచి ఫలితాలు వస్తాయి. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు వేప పిండి, సంబంధిత ఉత్పత్తులు సబ్సిడీలపై అందిస్తే సేంద్రియ వ్యవసాయం వైపు వెళ్లేందుకు అవకాశం కలుగుతుంది.

– శ్రీనివాస రెడ్డి, దోర్నాల, ప్రకృతి వ్యవసాయ రైతు

వేప మంచి కీటక నాశిని



వరి పైరులో వేప మంచి కీటక నాశిని. వేప ఉత్పత్తులను వినియోగించి సాగు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. నూనె తీసిన తర్వాత మిగిలిన వేప చెక్క, ఎండిన వేప ఆకులు, కాయలు దంచగా వచ్చే పిండిని సైతం అనేక పంటల సాగులో ఉపయోగించుకోవచ్చు. ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యంగా వేప పాత్ర కీలకం. ఈ ఏడాది 55,584 మంది రైతులతో 78 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేయించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వి.సుభాషిణి, ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయం

జగనన్నను వీడేదే లేదు...

- ఐదేళ్ల ఆయన పాలన సంక్షేమ సాగరంగా సాగింది
- మనోధైర్యంతో జీవనం గడుపుతూ వచ్చాం
- నెల రోజుల టీడీపీ ప్రభుత్వంలో అరాచకాలు ఎదురవుతున్నాయి
- మద్యం తాగి మహిళలని దుర్భాషలాడుతున్నారు
- ఎమ్మెల్యే ఎదుట వాపోయిన శతకోడు మహిళలు
- అండగా ఉంటానని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



శతకోడు మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలన సంక్షేమ సాగరంగా సాగిందని, తాము ఎంతో మనోధైర్యంతో జీవనం గడిపామని పుల్లలచెరువు మండలంలోని శతకోడు గ్రామానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌తో అన్నారు. మంగళవారం శతకోడు నుంచి దాదాపు 60 మంది మహిళలు యర్రగొండపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని తమ గ్రామంలో జరుగుతున్న టీడీపీ అరాచకాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజుల్లోనే గ్రామంలో టీడీపీ వర్గీయులు అలజడి సృష్టిస్తున్నారని, మద్యం తాగి మహిళలని చూడకుండా దుర్భాషలాడుతున్నారని వారు వాపోయారు. పోలింగ్ సందర్భంగా తమ గ్రామంలో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకొని అనునిత్యం ఏదో ఒక రకంగా రెచ్చగొట్టాలని వాళ్లు చూస్తున్నారని, టీడీపీ వర్గానికి చెందిన మహిళలను తమపైకి ఎగదోస్తున్నారని, ఎదురు తిరిగితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వర్గీయులకు కొత్త పింఛన్లు మంజూరు చేయనివ్వమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమ దరిచేరనీయమని వాళ్లు అంటున్నారని మహిళలు తెలిపారు. ఇప్పటి వరకు సంక్షేమ పథకాలకు తోడుగా ఉపాధి పనులు చేసుకొని జీవించే తమకు ఇప్పుడు అనేక కష్టాలు వచ్చిపడ్డాయని, వెంటనే చర్య తీసుకొని సమస్యకు పరిష్కారం చూపించాలని వారు కోరారు. తమకు ఎన్ని కష్టాలు వచ్చిపడినా జగనన్నను వీడేది ఉండదని, ఆయన వెంటే తామంతా నడుస్తామని వారు తెలిపారు.

అండగా ఉంటానని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే తాటిపర్తి

శతకోడు గ్రామానికి చెందిన వారితోపాటు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. జగనన్న ఆశీస్సులు తమ అందరిపై ఉన్నాయని, ఇడుపులపాయలో నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితుల గురించి ఆయనతో చర్చించినట్లు తెలిపారు. టీడీపీ వర్గీయులు తమ గృహాల పైకి వచ్చి అల్లర్లు చేసిన, దాడులు జరిపేందుకు ప్రయత్నించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సంబంధిత వ్యక్తులపై ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఫిర్యాదు చేసినా తగిన స్పందన లేకుంటే ఆ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని అన్నారు. కొత్త పింఛన్లు, హౌసింగ్, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైనవారందరూ అర్జీలు దాఖలు చేయాలని, వాటిపై తాను తగిన చర్యలు తీసుకొని మంజూరు అయ్యేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో దాడులకు గురైన నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తగిన ఆర్థిక సహాయం అందచేసిందని, ఎల్లవేళలా పార్టీ తమ అందరికీ అండగా ఉంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని అన్నారు. జగనన్నపై ఉన్న అభిమానంతో సుదూర ప్రాంతం నుంచి వచ్చిన మహిళలను ఆయన అభినందించారు.

ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సిద్ధం

ఒంగోలు: 2024లో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సిద్ధంగా ఉన్నాయని ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలు, జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లు మార్చి, అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఉత్తీర్ణత సర్టిఫికెట్లను బుధవారం ఉదయం ఆర్ఐవో కార్యాలయం నుంచి తీసుకెళ్లాలన్నారు. వాటిని తిరిగి విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు.

పొగాకు ధర గరిష్టంగా రూ.365



పొదిలి పొగాకు బోర్డులో వేలానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో పొగాకు ధర మంగళవారం గరిష్టంగా కేజీ రూ.365 ధర పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 3669 బేళ్లు రాగా, 3246 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 423 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 101వ రోజు వేలం పాటలో 2821 బేళ్లు రాగా 2508 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 313 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో కేజీ గరిష్ట ధర రూ.365, కనిష్టంగా రూ.205 సరాసరి రూ.310.12 వచ్చింది. వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 96వ రోజు వేలం పాటలో 848 బేళ్లు రాగా, 738 బేళ్లు కొనుగోలయ్యాయి. 110 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో గరిష్టంగా రూ.365, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.303.52 పలికింది.

మాతృమరణాలను నివారించాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.సురేష్ కుమార్



మాతృ మరణాలపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

ఒంగోలు టౌన్: జిల్లాలో ఎక్కడా మాతృమరణాలు సంభవించకుండా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.సురేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మాతృ మరణాల సబ్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకర సంకేతాలు కలిగిన గర్భిణులు ముందుగానే గుర్తించాలని సూచించారు. వారి కాన్పునకు సంబంధించి బర్త్ ప్లాన్ తయారు చేయాలని, ప్రొటోకాల్ ప్రకారం వైద్య సేవలు అందించాలని చెప్పారు. వైద్యాధికారి పర్యవేక్షణలోనే వైద్య సేవలు అందించాలన్నారు. అత్యవసర సేవల కింద గర్భిణులను ఆశా, ఏఎన్ఎంలు సమీపంలోని ఏరియా ఆస్పత్రికి కాని, సర్వజన ఆస్పత్రికి కానీ 108 వాహనంలో తరలించాలన్నారు. గైనకాలజిస్టు ద్వారా వైద్య చికిత్సలు, కాన్పులు చేయించాలని చెప్పారు. ప్రతి నెలా 10 తేదీ జరిగే ప్రధాన మంత్రి మాతృ వందన యువజన కార్యక్రమానికి గర్భిణులను తీసుకొచ్చి అవసరమైన వైద్య పరీక్షలు, స్కానింగులను చేయించాలని వాటి వివరాలను గర్భిణి కుటుంబ సభ్యులకు వివరించి చెప్పాలన్నారు. పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటుందో లేదో పరిశీలించాలని సూచించారు. సమీక్షలో డీఐఓ డా.పద్మజ, డీపీహెచ్ఎన్ఓ సుగుణమ్మ, మాస్ మీడియా ఉప అధికారి సరోజిని, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల సత్ప్రవర్తనతో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనంలో వైద్య శాఖలోని వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, అందుకోసం విభాగాల వారీగా ఉన్న సిబ్బంది వివరాలపై ఆరా తీశారు. ఆస్పత్రుల్లో పారిశుధ్యం, సెక్యూరిటీ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. వైద్యులు అనుమతి లేకుండా సెలవులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగుల కోసం మరుగుదొడ్లు, తాగునీరు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని, ఆస్పత్రులకు వచ్చిన రోగులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం ఉండకూడదన్నారు. జిల్లా స్థాయిలో తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన ఆదేశాలు కేవలం కాగితాలపైనే కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ సురేష్, డీసీహెచ్ఎస్ శేషుకుమార్, డీఐఓ పద్మజ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు, డిప్యూటీ సూపరింటెండెంట్‌లు ప్రభాకర్, బాలజీ నాయక్, మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజమన్నార్, సూపరింటెండెంట్ సావిత్రి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ హేమంత్, మలేరియా అధికారి మాధవీలత, డిప్యూటీ డీఎంహెచ్ఓలు పాల్గొన్నారు.

విద్యా శాఖపై సమీక్ష

అనంతరం విద్యా శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అకడమిక్, ఎస్టాబ్లిష్‌మెంట్ కార్యకలాపాలు, విద్యాలయాల్లో చేపడుతున్న నిర్మాణాలు, వివిధ యాజమాన్యాల కింద ఉన్న పాఠశాలల వివరాలు, వాటిలో ఉన్న విద్యార్థులు అందిస్తున్న ఆహారం, తాగునీరు, పారిశుధ్యం తదితర అంశాలపై ఆరా తీశారు. బడి వయసు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. సమావేశంలో డీఈఓ సుభద్ర, డిప్యూటీ విద్యాధికారులు అనితారోజ్ రాణి, చంద్రమౌళీశ్వర్, ఏపీఈడబ్ల్యూ ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కర్‌బాబు, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు మన్నెయ్య, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మాధవీలత ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్ పర్యటనలో పాము కలకలం

మార్కాపురం: మార్కాపురంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ పక్కనే ఉన్న జీజీహెచ్‌లో చేపట్టిన తనిఖీల్లో పలు విషయాలు వెల్లడయ్యాయి. కార్యక్రమంలో అర్జీదారులు జీజీహెచ్‌లో అందుతున్న సేవలు, భోజనం, పలువురు డాక్టర్లపై ఫిర్యాదు చేయడంతో ఆమె ఆస్పత్రిని తనిఖీ చేశారు. సుమారు 2 గంటల పాటు కలెక్టర్ తమీమ్ అన్సారియా వైద్యశాలలోని వివిధ విభాగాలను సందర్శిస్తూ ఒక బ్లాక్ నుంచి మరొక బ్లాక్‌కు వెళ్తున్న సమయంలో రక్తపింజర పాము కంటపడింది. దీంతో ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపడ్డారు. వైద్యశాల వెనుకభాగంలో అపరిశుభ్ర వాతావరణం ఉండటాన్ని కలెక్టర్ గమనించారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడగా ..నాణ్యమైన భోజనం తమకు అందడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె స్వయంగా రోగులకు పెడుతున్న భోజనం, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. రాత్రిళ్లు రోడ్డు ప్రమాదాలు, డెలివరీ కోసం చికిత్సకు వెళితే ప్రాథమిక చికిత్స చేసి ఒంగోలు రిమ్స్‌కు పంపుతున్నారని పలువురు కలెక్టర్‌కు తెలిపారు. దీంతో ఆమె రికార్డులను పరిశీలించగా గత నెలలో 33 మందిని ఒంగోలు జీజీహెచ్‌కు పంపినట్లు గుర్తించి, ఎందుకిలా జరుగుతుందని ప్రశ్నించారు. రాత్రిళ్లు విధుల్లో వైద్యులు ఉండటం లేదని, నర్సింగ్ సిబ్బందితో సరిపెడుతున్నారని రోగులు ఫిర్యాదు చేశారు.

భార్యపై భర్త దాడి

మద్దిపాడు: భార్యపై భర్త దాడి చేసిన ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన మద్దిపాడు ఘడియపూడి కాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే..ఘడియపూడి కాలనీకి చెందిన లావణ్య అనే యువతికి ఒంగోలు విరాట్‌నగర్‌కు చెందిన ద్వార మణి కంఠాచారితో 2017లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్ని రోజులుగా మణి కంఠాచారి లావణ్యతో గొడవ పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. వేరే యువతితో అక్రమ సంబంధం కొనసాగిస్తూ భార్యను నిత్యం వేధించేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. గత ఏడాది నుంచి వీరిద్దరి మధ్య గొడవలు పెరిగిపోవడంతో లావణ్య ఘడియపూడిలో తండ్రి వద్దకు వచ్చి పనులు చేసుకుంటూ జీవిస్తుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఘడియపూడి కాలనీకి వచ్చిన మణికంఠాచారి ఆమెపై దాడి చేయడంతో తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అడ్డురాగా వారిపై దాడి చేశారు. యువకులు అతన్ని కొట్టి పోలీసులకు సమాచారం అందిండంతో వారు వచ్చి మణికంఠాచారిని ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించి ఒంగోలు ఆసుపత్రికి తరలించారు.

దొంగలకు దేహశుద్ధి

కొమరోలు: దేవాలయంలో దొంగతనానికి యత్నించిన దొంగలను పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన మండలంలోని గోనపల్లె గ్రామ సమీపంలోని పోలేరమ్మ దేవాలయంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పోరుమామిళ్ల మండలం అక్కలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రజనాల సూరి, దాసరిపల్లి కిరణ్‌లు కడప-అమరావతి రాష్ట్రీయ రహదారిలోని గోనపల్లె గ్రామ సమీపంలోని పోలేరమ్మ దేవాలయంలో తలుపులు పగులగొట్టడానికి యత్నించారు. గమనించిన గ్రామస్తులు దొంగలకు దేహశుద్ధి చేసి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై మధుసూదన్‌రావు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డెత్ హైవే..!



పాలిటెక్నికల్ కళాశాల ఎదురుగా జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనాలు



ఫ్లైఓవర్‌పై ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం, మృతి చెందిన వ్యక్తి(ఫైల్)

అనంతపురం–అమరావతి హైవే రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. హైవే రోడ్డు కావడంతో వాహనదారులు మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, రోడ్డు నిబంధనలు పాటించకపోవడం, మద్యం సేవించడం వాహనాలు నడపడం వంటి కారణాలతో ఈ హైవేపై రోజు రోజుకు ప్రమాదాలు పెరుగుతున్నాయి. కంభం మీదుగా వెళ్లే హైవే రోడ్డుపై గడిచిన పది రోజుల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా..ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.

- నెత్తురోడుతున్న హైవే రోడ్డు
- ప్రమాదాలకు నిలయంగా జంగంగుంట్ల – కంభం మధ్య హైవే
- రోజురోజుకు పెరుగుతున్న ప్రమాదాలు
- పది రోజుల్లో ముగ్గురు మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు

కంభం:

మండల పరిధిలోని జంగంగుంట్ల- కంభం హైవేపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. పోలీసులు నిత్యం వాహనాలు తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నా, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా వాహనదారుల్లో ఏ మాత్రం చలనం రావడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. హైవేరోడ్డు నిర్మించిన తర్వాత రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయింది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా రైల్వే గేటు పైన నూతనంగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించిన తర్వాత తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫ్లైఓవర్ వేసిన తర్వాత ఈ ప్రాంతంలో సుమారు 15 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా 40 మంది వరకు గాయాలపాలయ్యారు. హైవేరోడ్డుపై జంగంగుంట్ల గ్రామం – కంభం మధ్యలో రోడ్డు ప్రమాదాలుఎక్కువగా జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండటం, రాత్రిళ్లు పూర్తి చీకటిగా ఉండటం, మార్జిన్లు తక్కువ వెడల్పుతో ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొట్టడం, ఒక్కోసారి అదుపుతప్పి వాహనాలు బోల్తా పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో నల్లవాగు, జంగంగుంట్ల ఊరిచివర, పాలిటెక్నికల్ కళాశాల, సీఎల్ఆర్ కళాశాల సమీపంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.



ఫ్లైఓవర్‌పై ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న హైవే సిబ్బంది (ఫైల్)



బేస్తవారిపేట-కంభం వచ్చే మార్గంలో హైవేపై యూటర్న్ వద్ద ప్రమాదకరంగా ఉన్న డివైడర్



ప్రమాదకరంగా హైవే పైనుంచి బస్టాండ్లోకి వెళ్లే వైజంక్షన్ ప్రాంతం

అక్కడే ఎక్కువశాతం ప్రమాదాలు..

హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా బేస్తవారిపేటకు వెళ్లే మార్గంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో పెద్దపెద్ద వాహనాలు మలుపు తిప్పుకునేందుకు యుటర్న్ ఏర్పాటు చేశారు. హైవేలో యూటర్న్ ప్రారంభానికి ముందు ఉన్న డివైడర్ పక్కన వెడల్పు తక్కువగా ఉండటంతో ఇక్కడ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రాత్రిళ్లు డివైడర్ కనిపంచక పెద్ద పెద్ద వాహనాలు బోల్తా పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే పై డివైడర్‌కు ఎడమవైపు హెచ్‌పి పెట్రోల్ బంకు ఉండటంతో పెట్రోలు పోసుకొని వచ్చే వాహనదారులు రాంగ్ రూట్‌లో వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. వీటితో పాటు వైజంక్షన్ మలుపు, చెన్నయ్యమటం మలుపు, గురుకుల పాఠశాల రోడ్డు, యర్రబాలెం మూలమలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి.

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే..

మద్యం సేవించి వాహనాలు నడపినప్పుడు అధికంగా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర గాయాలు కావడం, ప్రాణాలు కోల్పోతున్నారు. మైనర్లు సైతం పెద్ద పెద్ద ద్విచక్రవాహనాలు తీసుకొని హైవే రోడ్లపైకి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. పోలీసులు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

> **రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలి**
>
> 
>
> వాహనదారులు కచ్చితంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపకూడదు. అలా వచ్చి ఏదైనా ప్రమాదానికి గురైతే ఆ కుటుంబంలో విషాదమే మిగులుతుంది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. మనం చేసే తప్పుల వల్ల ఒక్కోసారి ఇతరులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. అది గమనించి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలి. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనం నడపాలి.
>
> **పులి రాజేష్,** ఎస్సై, కంభం

అక్రమార్కులకు కొమ్ముకాస్తుందెవరు..?

- సింగరాయకొండ పంచాయతీకి సస్పెండ్ అయిన అధికారులే దిక్కు..!
- లక్షల రూపాయల ప్రజల సొమ్ము లూటీ చేసిన అధికారులు
- విచారణ చేయడంలో ఉన్నతాధికారుల మీనమేషాలు



పంచాయతీ కార్యాలయంలో విచారణకు వచ్చిన డీపీఓ

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: అవినీతి, అక్రమాల్లో పోటీలు పెడితే సింగరాయకొండ పంచాయతీ రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలుస్తుంది. ఈ పంచాయతీలో అధికారుల అవినీతి ఆ స్థాయిలో ఉంటుంది. గత నాలుగేళ్లలో ఈ పంచాయతీలో విధులు నిర్వహించిన అధికారులంతా లక్షలాది రూపాయలు దోచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పలువురు అధికారులు సస్పెండ్‌కు సైతం గురయ్యారు. పంచాయతీకి నిజాయితీ అధికారులను నియమించమని కోరితే..వెతికి మరీ సస్పెండ్ అయిన పంచాయతీ కార్యదర్శులను పంపించారని సర్పంచ్ వర్గీయులు ఆరోపిస్తున్నారు.

ఆది నుంచి వివాదాస్పదమే..

ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి జేవీ రామకోటయ్య తీరు ఆది నుంచి వివాదాస్పదమే. అవినీతి ఆరోపణలకు పాల్పడుతున్నాడని జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీలో అనేక అవకతవకలకు పాల్పడ్డాడని, ఇంటి పన్ను వసూలు, ఇంటిపన్ను నిర్ధారణలో కూడా అవినీతికి అంతే లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అతనిపై విచారణ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకొని మరొకరిని నియమించాలని సర్పంచ్ వనజ కలెక్టర్, డీపీఓలకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ పనిచేసిన జూనియర్ అసిస్టెంట్లపై కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఒకరు సస్పెన్షన్‌కు గురి కాగా, మరొకరు సెలవుపై వెళ్లారు. దీంతో కొంత కాలంగా జూనియర్ అసిస్టెంట్ గదికి తాళం వేసి ఉంది. ఈ క్రమంలో జిల్లా అధికారులు జూనియర్ అసిస్టెంట్ గదిలో గత నెల 27న పంచనామా నిర్వహించి రికార్డులు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రికార్డులు బయటపడితే అవినీతి ఎక్కడ బయటపడుతుందోనని ఆందోళన చెందిన కార్యదర్శి రామకోటయ్య..సెలవులో ఉన్న జూనియర్ అసిస్టెంట్ విజయకృష్ణపై ఒత్తిడి తీసుకువచ్చి విచారణకు ఒక్క రోజు ముందు కార్యాలయానికి వచ్చి కొన్ని రికార్డులు తీసుకు వెళ్లారు. విచారణకు ఒక్క రోజు ముందు రికార్డులను కార్యాలయం నుంచి తీసుకువెళ్లడంతో ఆందోళన చెందిన సర్పంచ్ వనజ..ఆ గదికి ఉన్న తాళానికి తోడు మరో తాళం వేశారు. దీంతో 27వ తేదీ జరగాల్సిన పంచనామా రద్దయింది. తరువాత ఈ నెల 6వ తేదీ పంచనామా చేయనున్నట్లు జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఈ నెల 5న సర్పంచ్ వనజ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీపీఓ టి.ఉషారాణి, డీపీఓ కార్యాలయ ఏఓ ప్రసాద్‌లను కలిసి సమస్యను వివరించి కార్యదర్శిపై శాఖాపరచర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

పక్కదోవ పట్టించేందుకు పన్నాగం..

ఈ క్రమంలో విచారణను పక్కదారి పట్టించేందుకు పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య సరికొత్త పన్నాగానికి పూనుకున్నాడు. కూటమి పార్టీ నేతలతో కలిసి గతంలో బ్లీచింగ్ సరఫరాలో అవకతవకలు జరిగాయని, అప్పట్లో విచారణ సక్రమంగా చేయలేదని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నేతలు అర్జీ ఇచ్చారు. ఈ ఫిర్యాదు ఆధారంగా జేసీ గోపాలకృష్ణ ఆదేశాలతో డీపీఓ ఉషారాణి మంగళవారం విచారణకు వస్తున్నట్లు ఉదయం 10 గంటలకు సమాచారం ఇచ్చారు. అయితే సర్పంచ్ తాను హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పగా డీపీఓ తాళాలు పగులగొట్టేందుకు ప్రయత్నించారు. తాను లేకుండా తాళాలు పగులగొడితే న్యాయపోరాటం చేస్తానని సర్పంచ్ చెప్పడంతో డీపీఓ విచారణను గురువారానికి వాయిదా వేశారు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన అవినీతి, ఆరోపణలను విచారించకుండా కూటమి పార్టీ నాయకులు ఫిర్యాదు చేసిన గంటల్లోనే విచారణకు రావడం ఏంటని సర్పంచ్ వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న తాటిపర్తి వనజ పరపతిని తగ్గించే విధంగా కుట్రలు చేస్తున్నారని, ఏదో విధంగా చెక్ పవర్ రద్దు చేసి తమకు ఇష్టం వచ్చిన వ్యక్తిని ఉప సర్పంచ్‌గా చేసి పంచాయతీని స్వాధీనం చేసుకోవాలని కుట్రలు పన్నుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన బొట్ల



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బొట్ల రామారావు

టంగుటూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ బీసీ విభాగం జోన్ 5 ఇన్‌చార్జి బొట్ల రామారావు మంగళవారం తాడేపల్లి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నేతల భౌతిక దాడులు, పోలీసుల అక్రమ కేసులు, వైఎస్సార్ సీపీ నేతల ఆస్తుల ధ్వంసం వంటి విషయాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ధైర్యంగా ఉండాలని, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

పచ్చిమేతతో అధిక పాల ఉత్పత్తి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జేడి బేబిరాణి

నాగులుప్పలపాడు: పాడి పశువుల్లో పాల ఉత్పత్తి అనేది పచ్చిమేతపై ఎక్కువగా ఆధారపడి ఉంటుందని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబిరాణి అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చదలవాడలో పశు పోషకులకు పచ్చిమేత వంగడాల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేడీ బేబిరాణి మాట్లాడుతూ పశుగ్రాసాల కోసం ఇప్పటికే సూపర్ నేపియర్, స్మార్ట్ సూపర్‌నేపియర్, రెడ్ సూపర్ నేపియర్, బాజ్రా నేపియర్ పశుగ్రాసాలు రైతులకు చాలా ఉపమోగకరంగా ఉంటాయన్నారు. పచ్చి మేతలు మేపడం వల్ల పాల ఉత్పత్తి వ్యయం పెరుగుతుందని, పశువులు కూడా ఆరోగ్యకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.రవి, డాక్టర్ బసవశంకరరావు, డాక్టర్ నాగభూషణరావు, విజయ్‌కుమార్‌రెడ్డి, భార్గవ్, రమిరెడ్డి సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ వసతి గృహం ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు నగరంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో మెనూ, వసతి, శుభ్రతపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూలో ఉన్నట్లు భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మున్సిపల్ నీరు కాచి అందిస్తున్నారని, మినరల్ బబుల్స్ వాటర్ ఇస్తున్నారని విద్యార్థులు తెలిపారు. మెనూపై విద్యార్థినులు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులు ఎక్కడ చదువుతున్నారు? ఏఏ గ్రామాల నుంచి వచ్చారు? ఏ పాఠశాలలో చదువుతున్నారు? ఆయా తరగతులకు పోర్షన్ ఎంత వరకు పూర్తయింది వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించగా డ్రైనేజీ నీరు బయటకు వెళ్లక కొంత ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్‌కు తెలిపారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని విద్యార్థినులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట వసతి గృహ సంక్షేమ అధికారి దుర్గాలక్ష్మి ఉన్నారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

- ఐదు దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల



రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖాధికారులు

మార్కాపురం: పట్టణంలోని ఐదు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు మార్కాపురం ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మిన వ్యాపారులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించే దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఇతర జిల్లాల్లో విత్తనాలు, పురుగుమందులు అమ్మరాదని, అలా అమ్మాలనుకుంటే లైసెన్సులు కలిగి ఉండాలని తెలిపారు. కొందరు వ్యాపారులు విత్తనాలు ఇతర జిల్లాల రైతులకు విక్రయించినట్లు తమ దృష్టికి వచ్చిందని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు విత్తనాల అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పురుగుమందుల దుకాణాల యజమానులు ఎప్పటికప్పుడు వారి వద్ద ఉన్న ఎరువులు విత్తనాల వివరాలను ధరలు చూపించే, స్టాక్ బోర్డు నిర్వహణ సక్రమంగా ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన రైతుకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. తనిఖీల్లో ఒంగోలు టెక్నికల్ ఏఓ శ్రీనివాసనాయక్, మార్కాపురం, తర్లుపాడు ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం విద్యార్థులు చేరేలా కృషి చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు లక్ష్మానాయక్

బేస్తవారిపేట: వసతి గృహాల్లో వందశాతం విద్యార్థులు చేరేలా కృషి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకుడు ఎస్. లక్ష్మానాయక్ అన్నారు. స్థానిక సహాయ సాంఘిక సంక్షేమ కార్యాలయంలో మంగళవారం బేస్తవారిపేట, గిద్దలూరు పరిధిలోని వసతి గృహ సంక్షేమాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వసతి గృహ సంక్షేమాధికారులంతా వారి పరిధిలోని అసిస్టెంట్ ఇంజినీర్లతో సంప్రదించి వసతి గృహాలకు కావాల్సిన మౌలిక సదుపాయాల వివరాలు, ప్రతిపాదనలను సేకరించి రెండు రోజుల్లో ఆ నివేదికను జిల్లా కార్యాలయానికి పంపించాలన్నారు. మెనూ తప్పక పాటించాలని, పీహెచ్‌సీ వైద్యులు క్రమం తప్పకుండా సందర్శించేలా చర్యలు తీసుకొని విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి నెల హాస్టల్ అడ్వైజరి కమిటీ సమావేశం, మూడు నెలలకొకసారి పీఏసీ సమావేశం నిర్వహించాలని తెలిపారు. సంక్షేమాధికారులు, నాల్గవ తరగతి సిబ్బంది హెడ్‌క్వార్టర్స్‌లోనే నివాసం ఉండాలని సూచించారు. స్టడీ అవర్స్ నిర్వహించి పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతివారం పరీక్షలు నిర్వహించి మార్కులు నమోదు చేయాలని, ప్రతి విద్యార్థికి 500కు పైగా మార్కులు సాధించేలా శిక్షణ ఇవ్వాలన్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా వారిని తీర్చిదిద్దాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

- ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందుతుందని ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ పర్యవేక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పది రోజులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో విద్యార్థులకు బోధనలో భాగంగా అందించాలని తెలిపారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు సమగ్ర బోధనా విధానాలు ఉపాధ్యాయులు అందించాలన్నారు. ఈ ఏడాది టీచ్ టూల్ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. బడి బయట ఉన్న పిల్లలందర్నీపాఠశాలల్లో చేర్పించి, నూరు శాతం నమోదు లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. స్టూడెంట్స్ కిట్స్‌ను విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందించాలన్నారు. విద్యా ప్రవేశ్ కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సమగ్రంగా అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు రాజాల కొండారెడ్డి, జీ సంజీవి, యువీ నారాయణరెడ్డిపాల్గొన్నారు. అలాగే మోడల్ స్కూల్‌ను ఆర్జేడీ తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.